సంక్షేమ రథం.. ప్రగతి పథం

- అభివృద్ధిలో దూసుకుపోతున్న నిడదవోలు
- నాలుగేళ్లలో సంక్షేమానికి రూ.2,005 కోట్ల కేటాయింపు
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు సారథ్యంలో ప్రగతి

నిడదవోలు: నియోజకవర్గంలో ప్రగతి పరుగులు పెడుతోంది.. అభివృద్ధి అందివచ్చింది. నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యేగా జి.శ్రీనివాస్‌నాయుడు పగ్గాలు చేపట్టిన నాలుగేళ్లలో అనేక సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిడదవోలును అన్నివిధాలా తీర్చిదిద్దారు. మొత్తం రూ.2005 కోట్లు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కేటాయించగా ఇందులో లబ్ధిదారులకు నేరుగా డీబీటీ పద్ధతిలో రూ.1,333 కోట్లు పథకాల ద్వారా అందించారు. మరో రూ.672 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టి నిడదవోలు మున్సిపాలిటీతో పాటు నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లోని పల్లెల రూపురేఖలు మార్చారు. 2009 నుంచి పదేళ్లు పాలించిన టీడీపీ నేతలు దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ఏ పని కావాలన్నా.. పేదలు సంక్షేమ పథకాలు పొందాలన్నా జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు సొమ్ము దండుకునేవారు. టీడీపీ హయాంలో చిన కాశీరేవులో రూ.కోట్లతో నిర్మించిన బ్రిడ్జి సైతం నాణ్యత లేక కుప్పకూలింది. అప్పట్లో గోదావరిలో ఇసుక, మట్టిని దోచుకున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా జి.శ్రీనివాస్‌నాయుడిని అత్యధిక మెజార్టీతో ప్రజలు గెలిపించగా, ఆనాటి నుంచి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు పడ్డాయి. అవేంటో తెలుసుకుందాం రండి..

పట్టాలెక్కిన ఆర్‌ఓబీ

నిడదవోలు రైలు గేటు వద్ద ఆర్‌ఓబీ నిర్మాణంపై ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఈ బ్రిడ్జి ఆవశ్యకతను వివరించి రూ.185 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం టెండర్ల ప్రక్రియ సాగుతోంది. స్థల సేకరణకు సంబంధించి లబ్ధిదారులకు రూ.22 కోట్లు ప్రభుత్వం చెల్లించింది.

సుందరంగా రహదారులు

నియోజకవర్గంలో రూ.113 కోట్లతో రహదారుల నిర్మాణానికి ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రూ.22 కోట్లతో వడలి- ముక్కామల ప్రధాన రహదారి, రూ.6.30 కోట్లతో నిడదవోలు- యర్నగూడెం ప్రధాన రహదారి అభివృద్ధి చేశారు. రూ.40 కోట్లతో నిడదవోలు- పెరవలి ప్రధాన రహదారి విస్తరించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దారు. రూ.4.50 కోట్లతో నిడదవోలు- ప్రత్తిపాడు రోడ్డు, రూ.3.30 కోట్లతో నిడదవోలు- విజ్జేశ్వరం వరకు ప్రధాన రహదారి రూపురేఖలు మార్చారు. రూ.2 కోట్లతో పందలపర్రు- గోపవరం వరకూ సీసీ రోడ్డు నిర్మించారు.



నిడదవోలులో కొత్త ఊరిని తలపిస్తున్న జగనన్న కాలనీ



అద్దంలా మెరిసిపోతున్న నిడదవోలు-విజ్జేశ్వరం ప్రధాన రహదారి

అందరికీ ఆరోగ్యం

నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని 30 పడకలుగా తీర్చిదిద్దారు. 9 మంది వైద్యులను నియమించి, పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందిస్తున్నారు. ఎమ్మెల్యే సొంత నిధులతో ప్రసూతి విభాగంలో ఏసీలు, ఆక్సిజన్ పైపులైన్లు ఏర్పాటు చేశారు. రూ.19 కోట్ల నాబార్డు నిధులతో ఆసుపత్రిని 100 పడకలుగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాడిమళ్లలో రూ.1.50 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ భవనం త్వరలోనే ప్రారంభం కానుంది. నాడు-నేడులో సమిశ్రగూడెం, కానూరు, పెరవలి, ఉండ్రాజవరం పీహెచ్‌సీలను అభివృద్ధి చేశారు.

సొంతింటి కల నెరవేర్చేందుకు..

నిడదవోలు మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో రూ.110 కోట్లతో 273 ఎకరాల స్థల సేకరణ చేసి 10,885 మంది అక్కచెల్లెమ్మలకు ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఇంటి స్థలం ఉన్న 4,766 మందికి గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేశారు. నిడదవోలు వైఎస్సార్ నగర్‌కి ఆనుకుని జగనన్న కాలనీతో పాటు మూడు లేఅవుట్‌లలో 3,071 మందికి ఇళ్లు ఇవ్వడంతో మరో ఊరు ఆవిష్కృతమైంది. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని సంతోషంగా గృహ ప్రవేశాలకు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడిని ఆహ్వానిస్తున్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు



ఎన్నికల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇచ్చిన హామీ మేరకు గోదావరి జలాలను ప్రతి ఇంటికీ అందించేందుకు చర్యలు చేపట్టారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.78 కోట్లతో ప్రతి గ్రామంలో పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిలతో పాటు రక్షిత మంచినీటి ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టారు. అలాగే సచివాలయాలతో పాటు రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల భవనాలను నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నియోజకవర్గంలో 650 మంది సచివాలయ ఉద్యోగులతో పాటు 1,313 మంది వలంటీర్లను నియమించి సంక్షేమ పథకాలను నేరుగా అర్హుల ఇంటి వద్దే అందిస్తున్నారు. నిడదవోలు పట్టణాభివృద్ధే ధ్యేయంగా రూ.113 కోట్లతో పలు పనులు చేపట్టారు.

జి.శ్రీనివాస్‌నాయుడు, ఎమ్మెల్యే, నిడదవోలు

నేడు మంత్రి పర్యటన

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శనివారం ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో నిర్వహించే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం ఐదు గంటలకు చాగల్లు మండలం మార్కొండపాడులో వలంటీర్లకు వందన కార్యక్రమానికి హాజరవుతారు. ఆరు గంటలకు కొవ్వూరు పట్టణం 16వ వార్డు ఔరంగబాద్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇస్తారు.

గోదావరిలోకి దూకి యువకుడి మృతి

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి నదిలో దూకి తాడేపల్లిగూడెం మండలం కొండ్రుపోలు గ్రామానికి చెందిన బొత్స విజయ్‌కుమార్ (26) శుక్రవారం మృతి చెందారు. హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తున్న విజయ్‌కుమార్ తన స్నేహితుడికి ఫోన్ చేసి తాను గోదావరిలో దూకి చనిపోతున్నట్లు చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు సమాచారం తెలుసుకుని స్థానిక రోడ్డు కం రైలు వంతెన వద్దకు చేరుకున్నారు. నదిలో గాలించగా విజయ్‌కుమార్ మృతదేహం లభ్యమైనట్లు పట్టణ ఎస్సై బి.దుర్గప్రసాద్ తెలిపారు. మృతుడి తండ్రి బొత్స ఏసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ యువకుడి మృతికి దారితీసిన కారణాలపై విచారణ చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



గోదావరిలో దూకి మృతి చెందిన బొత్స విజయ్‌కుమార్

ఆహ్లాదకరంగా కంబాలచెరువు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని కంబాల చెరువును ఆహ్లాదకరంగా, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోని తీసుకువస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం కంబాలచెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. పనులను వేగవంతం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.

















సంక్షేమ పాలనను ఆశీర్వదించండి

హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత కోరారు. శుక్రవారం రాత్రి స్థానిక ఏడో వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని మంత్రి వివరించారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా తిరిగి జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ వైస్ పర్సన్ గంగ్రోతు అంజనీదేవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, ఏడో వార్డు ఇన్‌చార్జి వేండ్ర సూరిబాబు, ఏలూరి విజయలక్ష్మి, సలాది సందీప్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి తానేటి వనిత

జిల్లాలోని 107 ప్యాక్ సొసైటీలకు కంప్యూటర్లు

సీటీఆర్ఐ: జిల్లాలోని 107 ప్యాక్ సొసైటీలకు కంప్యూటర్లు, అనుబంధ పరికరాల కొనుగోలుకు జిల్లా స్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ ఆమోదం తెలిపి రాష్ట్రస్థాయి కమిటీకి సిఫారసు చేయడం జరిగిందని కలెక్టర్ కె. మాధవీలత తెలిపారు. జిల్లా సహకారశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన జిల్లాస్థాయి అమలు, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఆమె చైర్మన్ హోదాలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను సాంకేతికంగా మరింత అభివృద్ధి చేసి, రైతులకు భరోసా ఇచ్చే క్రమంలో కంప్యూటర్, ఇతర అనుబంధ పరికరాలను ఆప్కాబ్ ద్వారా కొనుగోలుకు జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి వై.ఉమారావు, డీసీసీబీ ముఖ్యకార్యనిర్వహణాధికారి ఆర్‌వీ నరసింహారావు, కాకినాడ, ఏలూరు డీపీడీఎం బి.తేజ, పి.కొండలరావు పాల్గొన్నారు.














































వైద్య సేవలు ప్రారంభం

ఉండ్రాజవరం: స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం నుంచి స్పెషలిస్ట్ డాక్టర్ల వైద్య సేవలు ప్రారంభించారు. ఉదయం ప్రసూతి వైద్య నిపుణురాలు మృదుల, ఊపిరితిత్తుల స్పెషలిస్ట్ మేరి వసంత రోగులకు వైద్య సేవలు అందించారు. వైద్యాధికారి రాజనాల ప్రసాద్ పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు సత్కారం

కొవ్వూరు: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సత్కరించి, నగదు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన డి.దుర్గాకిరణ్, కె.లలిత, యు.రోషిణిలకు నగదు ప్రోత్సాహకాలతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. వారిని హెచ్‌ఎం ఎం.తిరుమల దాస్, కౌన్సిలర్ నీలిమ, తల్లిదండ్రుల కమిటీ చైర్ పర్సన్ కవిత సత్కరించారు.



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో అధికారులు, ప్రజాప్రతినిధులు

ఏపీ పీజీఈసెట్‌లో మాధురి ప్రతిభ



కొవ్వూరు: ఐ.పంగిడి గ్రామానికి చెందిన కొప్పాక మాధురి ఏపీ పీజీఈసెట్‌లో కెమికల్ ఇంజినీరింగ్‌లో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. ప్రస్తుతం కాకినాడ జేఎన్‌టీయూలో ఆమె పెట్రోలియం ఇంజినీరింగ్ పూర్తి చేసింది. పదో తరగతిలో 9.0 జీపీఏ, ఇంటర్‌లో 9.6 జీపీఏ, బీటెక్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. ఈ ఏడాది తిరుపతి శ్రీవేంకటేశ్వర యునివర్సిటీ నిర్వహించిన పీజీ ఈసెట్‌లో మూడో ర్యాంకును సొంత చేసుకుంది. భవిష్యత్తులో కెమికల్ ఇంజినీర్‌గా స్థిర పడాలని ఉందని ఆమె చెబుతుంది.

జీడిమామిడి తోట దగ్ధం



పల్లంట్లలో కాలిపోయిన జీడిమామిడి తోట

దేవరపల్లి: పల్లంట్లలో గురువారం రాత్రి జీడిమామిడి తోట దగ్ధమైంది. ఈడ్పుగంటి సత్యనారాయణకు చెందిన 3.98 ఎకరాలు, మొగలపు లక్ష్మణరావుకు చెందిన 4.62 ఎకరాలు, ఈడ్పుగంటి లక్ష్మికి చెందిన 3.16 ఎకరాల జీడిమామిడి తోట పాక్షికంగా దగ్ధమైనట్టు గ్రామ రెవెన్యూ అధికారి శేషుకుమార్ శుక్రవారం తెలిపారు.

విద్యుత్‌ను సమర్థంగా వినియోగించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఈఈ వెంకటేశ్వరరావు

నల్లజర్ల: వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం సమర్థవంతంగా జరగాలని తాడేపల్లిగూడెం డివిజన్ విద్యుత్ శాఖ డీఈఈ ఎస్.వెంకటేశ్వరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ ఆధ్వర్యంలో నల్లజర్ల విద్యుత్ సబ్ స్టేషన్‌లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యుత్ తయారీకి అవసరమైన ఇంధన వనరుల కొరత ఏర్పడనున్న దృష్ట్యా మనం ఇప్పటి నుంచే సోలార్ పవర్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. మరోపక్క కాలుష్య నివారణ జరగాల్సి ఉందన్నారు. థర్మల్ విద్యుత్ తయారీలో వినియోగించే బొగ్గుతో వాతావరణం కాలుష్యమై ఒక్కో సందర్భంలో ఆమ్ల వర్షాలు పడి పంటలు పాడయ్యే ప్రమాదముందన్నారు. విద్యుత్ వృథా కాకుండా రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు ఒక శాతం విద్యుత్ వినియోగం తగ్గించినా తమ ప్రయత్నం సఫలం అయినట్టేనన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలన్నారు. నాణ్యమైన వాటర్ పంపులు, ఐఎస్ఐ పైపులు వినియోగంతో కూడా విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఇటీవల విద్యుత్ ఉద్యోగుల మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రమాదాల నియంత్రణకు సిబ్బంది ఏకాగ్రతతో పనిచేయడంతో పాటు పనిచేసే సమయాల్లో సెల్‌ఫోన్‌లలో మాట్లాడడం తగ్గించాలని డీఈఈ సూచించారు. ఇటీవల కాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి వైర్ల చోరీ చేస్తున్నారని, అటువంటివి అరికట్టడానికి రైతులే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. నల్లజర్ల ఏడీఏ రాజాబాబు, ఏఈలు పి.బాపిరాజు, ఎంవీ రమణ, వీవీ నారాయణ, విద్యుత్ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల్లో తనిఖీలు



తాళ్లపూడి పెట్రోల్ బంక్‌లో తనిఖీ చేస్తున్న సాయిరాం

తాళ్లపూడి: మండలంలోని పెట్రోల్ బంకలను శుక్రవారం లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల స్పందనలో పలువురు ఫిర్యాదులు చేయడంతో తాళ్లపూడి, ప్రక్కిలంకలోని పెట్రోల్ బంకుల్లో అమ్మకాలు, కొలతలను లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ బి.సాయిరాం పరిశీలించారు. పెట్రోల్ నాణ్యతలో లోపాలుంటే నేరుగా పెట్రోల్ కంపెనీ సేల్స్ మెన్‌కు ఫిర్యాదు చేయాలని ఆయన అన్నారు. ఆయన వెంట లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జీవీ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.


దేవరపల్లిలో నిర్మానుష్యంగా బస్టాండ్ సెంటర్

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- అల్లాడుతున్న ప్రజలు

నెత్తిన నిప్పుల కుంపటి

దేవరపల్లి: భానుడు భగభగలు పుట్టిస్తున్నాడు.. నడినెత్తిన చుర్రుమనిపిస్తున్నాడు.. సూర్యోదయంతోనే మంటలు రేపుతూ ముందుకు వస్తున్నాడు. దేవరపల్లి మండలంలో నాలుగు రోజుల నుంచి వేడి తీవ్రత అధికమైంది. వడగాడ్పులకు తట్టుకోలేక వృద్ధులు, మహిళలు, చిన్నారులు అల్లాడిపోతున్నారు. విద్యుత్ వినియోగం పెరగడంతో గ్రామీణ ప్రాంతాల్లో సరఫరాకు తరచూ అంతరాయం ఏర్పడుతుంది. బయటకు వస్తే వడగాల్పులు, ఇంట్లో ఉంటే ఉక్కబోత ఉండడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. మే నెలలో కూడా ఇటువంటి ఎండలు లేవని అంటున్నారు. ఎండలకు పండ్లు, కూరగాయలు పాడైపోతుండడంతో వ్యాపారాలు నష్టపోతున్నారు. చాలాచోట్ల మధ్యాహ్నం 12 గంటలకే దుకాణాలను మూసివేస్తున్నారు. సాయంత్రం 6 గంటల తరువాత దుకాణాలు తెరుచుకుంటున్నాయి. నిత్యం జనసంచారంతో ఉండే దేవరపల్లి, యర్నగూడెం బస్టాండ్ సెంటర్లు ఉదయం 11 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. శుక్రవారం దేవరపల్లిలో 43 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

చాగల్లు: మండలంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండల తీవ్రతకు జనం భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకే ఎండ చుర్రుమనిపిస్తుంది. చాగల్లు తదితర గ్రామాల్లో రహదారులు నిర్మానుష్యంగా మారాయి.


దేవరపల్లిలో కొబ్బరి బొండాల వ్యాన్ వద్ద గుమిగూడిన జనం







ఆనందమని పింఛెన్

- ఒకటో తేదీ వేకువజామునే చేతిలో నగదు
- తలుపు తట్టి ఇస్తున్న వలంటీర్లు
- లబ్ధిదారులకు తప్పిన తిప్పలు

దేవరపల్లి: ఒంటరి జీవనం.. వృద్ధాప్యంలో బతుకు అగమ్యం.. వైకల్యంతో తీర్చలేని కష్టం.. వితంతువులకు కానరాని గమ్యం.. ఇలా ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యథ. ఏం తినాలి.. ఎలా బతకాలి.. ఎక్కడ ఉండాలి.. అనేవన్నీ ప్రశ్నలే.. ఈ కష్టాలన్నీ చెరిపేస్తూ నూతన శకానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారు.. పెద్ద కొడుకులా నిస్సహాయుల జీవితాల్లో ఆనందం నింపారు.. అర్హులందరికీ పెంచిన పింఛన్లు ఇస్తూ బడుగుల జీవితాలకు భరోసా తెచ్చారు.. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువ జామునే వలంటీర్ల ద్వారా వైఎస్సార్ పింఛను కానుక సొమ్ము అందిస్తూ ప్రతి కుటుంబానికి వెలుగునిచ్చారు.

గత ప్రభుత్వంలో రూ.2 వేల చొప్పున పింఛన్ సొమ్ము ఇవ్వగా, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2,750 అందిస్తుంది. త్వరలోనే ఆ సొమ్ము రూ.3 వేలకు పెంచనుంది. దేవరపల్లి మండలంలో గత టీడీపీ ప్రభుత్వంలో 8,864 మందికి పింఛన్ల కింద రూ.1.86 కోట్ల సొమ్ము ఇచ్చేవారు. ప్రస్తుత జగనన్న ప్రభుత్వంలో 10,743 మంది లబ్ధిదారులకు రూ.8.44 కోట్లు పంపిణీ చేస్తున్నారు. వృద్ధులకు రూ.2,750, వితంతువులకు రూ.2,750, దివ్యాంగులకు రూ.3 వేలు, కిడ్నీ రోగులకు రూ.10 వేలు, పక్షవాత రోగులకు రూ.5 వేల చొప్పున పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. నెలలో మొదటి రోజునే లబ్ధిదారులకు సొమ్ము అందిస్తుండడం విశేషం. తెల్లవారక ముందే వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి తలుపు తట్టి చేతిలో పింఛన్ సొమ్ము పెడుతున్నారు. ఈ సొమ్ము తమకు ఆసరాగా నిలుస్తుందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పడిగాపులు.. ప్రయాశలు

టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకూ పడిగాపులు పడాల్సి వచ్చేది. అది కూడా ఎప్పుడు ఇస్తారో తెలియదు. చివరికి రాత్రికి ఇంటికి వచ్చేవారు. ఒక్కోరోజు సర్వర్ పనిచేయకపోవడంతో పంపిణీ నిలిపివేసేవారు. కొంతమంది రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. ఎన్నికల ముందు పాదయాత్రలో లబ్ధిదారుల కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమూల మార్పులు తీసుకొచ్చారు. ప్రతిష్టాత్మకంగా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ఇంటి వద్దకే పింఛను సొమ్ము అందిస్తున్నారు. ప్రజల దీవెనలు అందుకుంటున్నారు. ఇదిలా ఉంటే పింఛన్ల మంజూరు నిరంతర ప్రక్రియ చేశారు. అర్హులతో వలంటీర్లు దరఖాస్తు చేయిస్తున్నారు. వీటిని పరిశీలించి అధికారులు మంజూరుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ఆరు నెలలకొకసారి (జనవరి, జూన్) కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ఈ విధంగా దేవరపల్లి మండలానికి ఏటా దాదాపు వెయ్యి అదనపు పింఛన్లు మంజూరవుతున్నాయి.



బందపురంలో పింఛను సొమ్ము అందిస్తున్న వలంటీర్, సచివాలయ సెక్రటరీ

దేవరపల్లి మండలంలో పింఛనుదారులు

పింఛన్ రకం	లబ్ధిదారులు
వృద్ధాప్య	4,612
వితంతు	3,867
దివ్యాంగ	1,164
చేనేత కార్మికులు	30
అభయహస్తం	239
కల్లుగీత కార్మికులు	151
ఒంటరి మహిళలు	512
మత్స్యకార	49
చర్మకారులు	99
డప్పు కళాకారులు	50

పడిగాపులు పోయాయి



నా పేరు ఉండవల్లి సీతారత్నం. మాది దేవరపల్లి. ప్రతి నెలా ఒకటినే పింఛన్ అందుతుంది. తెల్లవారక ముందే వలంటీర్ వచ్చి ఇంటి తలుపుతట్టి నిద్రలేపి చేతిలో పింఛన్ సొమ్ము రూ.2,750 పెడుతున్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవాలంటే పంచాయతీ వద్ద పడిగాపులు పడేదాన్ని. జగనన్న ఇస్తున్న పింఛన్ తమలాంటి వారిని ఆదుకుంటుంది. ఈ పింఛన్ విధానం బాగుంది.

–ఉండవల్లి సీతారత్నం, దేవరపల్లి

ఇంటికే పింఛను



నా పేరు అనపర్తి వెంకటరత్నం. మాది దేవరపల్లి. సీఎం జగన్ పెద్ద కొడుకులా ప్రతి నెలా రూ.2,750 పింఛన్ అందిస్తున్నారు. ఈ సొమ్ముతో మందులు కొనుకుంటున్నాను. గ్రామ వలంటీర్ ద్వారా ఇంటికే పింఛన్ ఇస్తున్నారు. గతంలో పింఛన్ తీసుకోవాలంటే నరకం చూసేవాడిని. నాలుగు రోజులు పనులు మానుకుని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎండలో పడిగాపులు పడేవాడిని.

–అనపర్తి వెంకటరత్నం, దేవరపల్లి

‘మానవత’కు విరాళం

నల్లజర్ల: అమెరికాలో నివాసం ఉంటున్న దేవళ్ల విజయ ఆమె భర్త దివంగత రామగోపాల్ పేరిట మండల మానవత సంస్థకు రూ.50,500 విరాళంగా అందజేసినట్టు మానవత జిల్లా నియంత్రణ కమిటీ సభ్యులు తెలిపారు.

పేరు, అడ్రసు మార్పు







నిబంధనలు పాటించండి

చాగల్లు: ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు నిబంధనలు పాటించాలని ఎంఈఓ పి.ఖాదర్‌బాబు అన్నారు. మండలంలో పలు స్కూళ్లను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. శనివారం వరకూ ఉదయం మాత్రమే పాఠశాలలు నిర్వహించాలని, సెలవు రోజుల్లో నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు.

‘జగనన్న సురక్ష’తో ఉచిత సేవలు

తాళ్లపూడి: జగనన్న సురక్ష పథకం ద్వారా ఈ నెల 23 నుంచి వచ్చే నెల 23 వరకూ సచివాలయాల్లో అందించే సేవలను ఇళ్ల వద్దకే వెళ్లి ఉచితంగా అందజేస్తారని తహసీల్దార్ టి.రాధిక తెలిపారు. దీనిపై స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపీడీఓ వెంకటరమణతో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు

కొవ్వూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థులు ఈ నెల 19 నుంచి 24వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ జె.సునీత తెలిపారు. ఈ నెల 26 నుంచి 30 వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లు కళాశాలలో ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. జూలై 3న సీట్ల కేటాయింపు, నాలుగు నుంచి తరగతులు ప్రారంభం ఉంటాయన్నారు. వివరాలకు 81432 25199, 94941 65717 నెంబర్‌లలో సంప్రదించాలని అన్నారు.





